# చేను, చేప

ఎవరు ఫోను చేశారో తెలీదు. సాయంకాలం నాలుగవుతూండగా పోలీసు జీపు తిన్నగా ఊళ్లోకి వచ్చి ఆగింది. నలుగురు పోలీసులూ ఒక ఇన్‌స్పెక్టరూ దిగేరు. తిన్నగా సర్పంచి గారింటికి దారి తీస్తూండగా ఇళ్లలోంచి జనం వెళ్లుకొచ్చేరు. కుర్చీవేసి సర్పంచిగారు అర్జంటుగా బోండాల కోసం పంపించేరు.

" చెప్పండి అయగారూ" అన్నాడు సర్పంచి.

" బావుంది. బుర్రలు బద్దల గొట్టేసుకుని నన్ను చెప్పండంటారేటి? మీరు చెప్పాలి. మీకు తెలిసింది అలా ఉంచండి. రేయి, ఆళ్లని లాక్కురండి..... ఆ... కథేటి సర్పంచిగారూ!"

ఈ లోగా బోండాం తలకొట్టి కపాలానికి చిల్లుపెట్టి గాజుగ్లాసులోకి కొబ్బరి నీళ్లు ఒంపి సర్పంచిగారికి అందించేడు పాలికాపు. గ్లాసునో సారి చూసి వినయవిధేయతల్తో ఎస్సైగారికి అందించేడు సర్పంచి.

"ఈటికేవుందిలెండి. ఆళ్లోచ్చేలోగా విషయం చెప్పండి. మా పని సులువవుద్ది. ఏడాదికోపాలి బుర్రలు బద్దలు కొట్టేసు కుంటారా?!"

"ఆయ. ఏ వుందండీ ఈ ఎధవ చేపల చెరువు లోచ్చేక ఊళ్లో గొడవ లెక్కువై పోయాయండి."

మరో అరగంటలో అయిదుగుర్ని జీపులో కుక్కి పట్టుకుపోయారు. ఊరంతా రాజుకుంది. మర్నాడుదయం తొమ్మిదవు తూండగా శివాలయానికి బయలు దేరారు శర్మగారు. శివుడి మీద భక్తి కంటే ఇంట్లోంచి బయట పడాలనిపించిందాయనికి. నాల్గైదు రోజుల్నించీ మనసు బాగాలేదు. విచిత్రమైన బెంగ భయం పట్టుకున్నాయి. కొడుకు అనేదాంట్లో కూడా ఎంతో కొంత నిజం ఉందని ఆయనికి తెలుసు. తనకి డభైరెండొచ్చేయనీ ఎరుకే. కానీ సొంత ఊరితో ఇన్ని సంవత్సరాల అనుబంధం? ఇక్కడ పెరిగిన చెట్టుతను. రాత్రి నిద్రకూడా సరిగా పట్టలేదు. సాయంకాలం పైగా ఊళ్లో గొడవ. చెప్పులు బయట వదిలిలోపలికి వెళ్లి దణ్ణం పెట్టుకుని నుంచున్నారు శర్మగారు. గర్భగుడిలోంచి వస్తూ రామకృష్ణ శర్మగారికి తీర్థం ఇచ్చి రెండు పువ్వులు చేతిలో పెట్టి అడిగేడు.

" రాఘవుడు రాలేదా?"

"గుడికి వస్తాడా ఏవిటి వాడు?"

నవ్వేడు రామకృష్ణ. రాఘవశర్మ, అతనూ ఊళ్లోబడికి కలిసి, వెళ్లిన వాళ్లు. రాఘవుడు చదువుకుని హైదరాబాదులో కొన్నాళ్లు ఉద్యోగం చేసి రియల్ ఎస్టేటులోకి దిగి బాగుపడ్డాడు. రామకృష్ణ పొరుగూర్లో సింగిల్ టీచరుగా, ఉన్న ఊళ్లో పూజారిగా ద్విపాత్రాభినయం చేస్తున్నాడు. 'ఉండం' డంటూ లోపలికి వెళ్లి అరటి పండు ప్రసాదం తీసుకొచ్చి చేతిలో పెట్టేడు. ఊళ్లో మిగిలినవి రెండే బ్రాహ్మణ కుటుంబాలు. వీరివీ వారివీ.

" కొట్టుకు చస్తున్నారు." అన్నాడు రామకృష్ణ

"విన్నాను"

"ఈ చేపల చెరువులొచ్చి ఊళ్లని చెడగొట్టేయి. ఇదేదో కొత్త కులం ఒచ్చి పడింది"

నిన్నటి గొడవంతా వివరించేడు రామకృష్ణ. శర్మగారికి మొదచుట్టూ కొబ్బరిగెల తగిలించినట్టనిపించింది. ఇదంతా తెలిసిం తరవాత కొడుకు ఊరుకుంటాడా? ఈ గొడవా వాడి కోసం వచ్చినట్టయింది. మండపం మెట్లమీద కూచున్నారు శర్మగారు. బనీను, లుంగీ గూడకట్టుకుని కొమరగిరి సత్యం గబగబలోపలికి వెళ్తూ శర్మగార్ని చూసి పలకరింపుగా నవ్వేడు. దణ్ణం పెట్టుకుని తెల్లబొట్టుకుని బయటికి రాగానే శర్మగారు పిలిచేరు.

" ఓ క్షణం కూచోగలవా?"

" ఆయ." అంటూ కూచున్నాడు సత్యనారాయణ.

" అస లేవైంది?"

"అసలేటండి వడ్డీ ఏటండి, పాత కదేనండి. మన ఇష్టమూర్తిగారి పొలం చౌదిరిగారికి అమ్మేశారు గదండీ. ఆయన మరిసేపలు పెట్టేడు. నిన్న సందకాడ నీళ్లొదిలేశారండి. తిన్నగా వంకా సూర్రావు, సూరారపు జానికిరావుడు, పైడి వెంకన్న ఇంకా కిందాళ్ల పొలాల్లోకి ఆ ఎదవ నీళ్లన్నీ దిగిపోయాయండి. అసలే ఇష్టమూర్తిగారి పాలికాపులు కొంచెం బాధపడతన్నారు లెండి. మరి సౌదరిగారి కాపలాదార్లున్నారు గదండి. ఇహ కిందిపొలాల్నించి మా వోళ్లు, మాలోళ్లు గొడవ కెళ్లేరండి. మాట మాట పెరిగిందండి. కొట్టుకున్నారండి. ముగ్గురు మాలోళ్లకీ మావోళ్లిద్దరికీ బుర్రలు బద్దలేసిపోయాయండి. ఎంతుకండీ, ఇంకో సెరువు నీళ్లుగాని ఒదిల్తే మీపొలం సేపల చెరువయిపోయేదండి. ఆయ."

శర్మగారు కొబ్బరిచెట్టువేపు చూస్తూ ఏవీ మాట్లాడలేదు. క్షణం ఆగి వెళ్లడానికి లేచి నుంచున్నాడు సత్యం.

"ఉంటానండి మరి.... సౌదరిగారు అబ్బాయిగారితో మాటాడతన్నారండి నిన్న?"

అర్థవంతంగా చూశాడు సత్యం. శర్మగారు సత్యం గురించి మర్చిపోయారు. సత్యం వెళ్లిపోయాడు. తనకేవీ చెప్పలేదు వాడు. తనకి చెప్పకుండానే బేరం కుదుర్చుకుంటున్నాడా? లేకపోతే చౌదరిగారు అడుగుతున్నారేమో, బెంగ కొంచెం ఒదిలి కోపం వచ్చింది. అలాగే కూచుండిపోయి, కాసేపటికి మెల్లిగాలేచి బయటికొచ్చి చుట్టు తిరిగి ఇంటిదారి పట్టేరు శర్మగారు. సెగ తగిలినట్టు ఊరి వాతావరణం శారీరకంగా తాకుతోంది. బిగదీసినట్టుంది ఊరు. కిరాణా కొట్టు దగ్గిర వక్కపొడి పొట్లం కొనుక్కుని సర్పంచిగారి వీధి వేపు నడిచే రాయన.

ఎన్నడో, కడుపు తిప్పి సముద్రం సుళ్లు తిరిగి లోపల ఉన్న గ్రామాన్ని ఉప్పెనలో విసిరి ఇవతల పారేసినట్టుంటుంది ఊరు. వైనతేయ గోదావరికీ సముద్రానికీ మధ్య మొత్తానికి కొంచెం సముద్రానికే దగ్గిరిగా పరుచుకున్న ఊరది; కాపులు, గవరలు, ఆరు బ్రాహ్మణ కుటుంబాలు నాలుగైదు క్షత్రియుల గడపలు, మోటారు పడవలున్న రెండు జాలరి కుటుంబాలు, దళితులు, ఒక స్కూలు, ఒక ప్రభుత్వ చికిత్సాలయం పేరుతో ఉన్న పెద్ద గదీ, మూడేళ్ల క్రితం కొత్తగా రంగుల్లో కట్టిన చర్చి. మరీ చిన్నా మరీ పెద్దాగాని గ్రామానికిచెంగులా పచ్చటిపలాలుండేవి. మూడు నాలుగేళ్ల క్రితం హైదరాబాదు నగరంతో ప్రత్యక్ష సంబంధం లేని గ్రామానికి ఇప్పుడు అయిదు కిలోమీటర్ల అవతలికి ప్రైవేటు బస్సు వస్తోంది. వంద సంవత్సరాల క్రితం తార్రోడ్డు ఉండేది కాదు. అప్పటికీ ఇప్పటికీతేడా ఒక్కటే. బ్రాహ్మణ కుటుంబాలన్నీ గ్రామం ఒదిలి వెళ్లిపోయాయి. దళితుల్లో మూడు కుటుంబాల వాళ్లు మతం తీసుకున్నారు. కాపుల్లో, క్షత్రియుల్లో హైదరాబాదులో ఉద్యోగం చేసేవాళ్లుండడం వల్ల గ్రామానికీ ఆ మహానగరానికీ చిరునామా బాంధవ్యం ఏర్పడింది. 1996లో ఉప్పెన వచ్చినపుడు ఊరు ఖాళీ చేసి సముద్రానికి వదిలేసి వెళ్లిపోయారు., మొదట్నించీ శర్మగారి పదిహేనెకరాలూ మాల సత్తయ్య కుటుంబం చేసేది. సత్తెయ్యదీ శర్మగారిదీ ఒకటే వయసు. సత్తెయ్య శ్రమ వల్లా ఈయన కొంచెం అనారోగ్యం వల్లా కుదేలయిపోయారు. ఇప్పుడు సత్తెయ్య కొడుకు చేస్తున్నాడు. మరో కొడుకు మతం తీసుకుని రాజోలు క్రిస్టియన్ స్కూల్లో ఎటండరు చేస్తున్నాడు. సముద్రానికి దగ్గిరున్న కోనసీమ గ్రామాలన్నీ గుట్టుగా ఉండేవి. కాసిని కొబ్బరి చెట్లూ, నాలుగు రోడ్లూ, గుడీ కొండపల్లి బొమ్మ ఊళ్లలా ఉండేవి. సర్పంచిగారిల్లు దాటుతూండగా అరుగుమీద నుంచి కేకల్లా వినబడ్డాయి. కనీసం ముగ్గురు ఒకేసారి మాటాడుతున్నారు.

"సెరువు పెట్టుకున్న కొడుకులికి కింద చేలున్నాయని తెలీదేటీ? ఏణ్నించో రావడం చెరువులు పెట్టడం...."

"అదిగాదెహె. ఊరు కానోడికి ఆ పవరేణ్ణించి వచ్చుద్ది?"

"నీ దగ్గిరా లెక్కుంటే(డబ్బు) నీకూ ఒచ్చుద్ది గు... లోంచి పొగరూ పవరూ. కోనసీవ మొత్తం చిల్లర డబ్బుల్తో కొంటాడయ్యా చౌదరి."

ఆ మాటలు వెంబడించేయి శర్మగార్ని. మళ్లీ బెంగ కొబ్బరిగెల మెళ్లో పడింది. శ్రీరామనవమీ, గణపతి నవరాత్రుల్లాగ ప్రతీ యేడూ చేపల చెరువులుకాపలాదార్లకీ కిందిరైతులకీ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. కాపలాదార్లు ఊళ్లోవాళ్లే. చెరువొడ్డున చిన్న బంగళాపెంకు ఇల్లు కట్టించుకుని తరచుగా అందులో చౌదరిగారి ఏజంటు ఉంటాడు. ఊరి పచ్చటికొంగు నీలం వాకలై పోయింది. భూములు అమ్ముకున్నవాళ్లూ, లీజుకిచ్చిన వాళ్లూ బాగుపడ్డారు. చెరువులూ పొలాల్లాగే ఊళ్లో చిన్న రైతులూ, చేపల చెరువుల వాళ్లూ విడిపోయారు. అసంకల్పితంగా ఊళ్లో రెండు వర్గాలు ఏర్పడ్డాయి. పోలీసులు ఊళ్లోకి రావడం ఇదేం మొదటిసారి కాదు. లాక్కుపోయిన వాళ్లకి మర్నాటికల్లా బెయిలు రావడం, పోలీసు అధికారుల్ని జాగ్రత్తగా చూసుకోవడం అన్నీ మామూలైపోయాయి. ఊరి పొలాలు, చెరువులు ఇప్పుడు సమానంగా ఉన్నాయి. చౌదరిగారికి చుట్టుపక్కల చెరువు లుండడంతో అందరూ ఆయన్ని చేపల చెరువుల చౌదరిగా రంటున్నారు.

శర్మగారు ఇల్లు చేరేసరికి రాఘవుడు లేడు. కాసేపు కొడుకు కోసం చూసి ఆయన భోజనం కానిచ్చేడు. తినాలనిపించలేదు. గుమ్మడి పులుసు కూడా రుచించలేదాయనకి. అయిందనిపించి లేచి వెళ్లి పడుకున్నారు శర్మగారు. రాఘవుడు ఒచ్చి అప్పుడే నాలుగు రోజులైంది. ఇద్దరు వాటాదారులతో రియల్ ఎస్టేటు వ్యాపారం చేస్తున్నాడతను. అతని తరువాతవాడు చెన్నైలో ఉద్యోగిస్తున్నాడు. రాఘవుడు మంచి ఇల్లు, కారు అమర్చుకున్నాడు. ఇపుడు అనుకోకుండా సొంతానికి మంచి గవర్నమెంటు కాంట్రాక్టు దొరికింది. మాటలూ ఒప్పందాలూ దరిదాపు పూర్తయినట్టే. ఇద్దర్లో ఒక వాటాదారు విడిపోయి సింగపూరు వెళ్లిపోయాడు. దీనికి తోడు సమయానికి పెద్ద మొత్తం చేతికి రాలేదు. కాంట్రాక్టు చేజారిపోడం ఇష్టంలేదతనికి. చెప్పాపెట్టకుండా ఊడిపడ్డ కొడుకుని చూసి ఇద్దరూ బోలెడు సంతోషించేరు. ఒచ్చిన రోజు రాత్రి భోజనం చేస్తూ అసలు విషయం చెప్పేడు రాఘవుడు. ముందు ఆశ్చర్యపోయినా తరవాత శర్మగారు ఏవీ అనలేదు.

"నా సంగతి అలా ఉంచండి. మీరు కూడా పెద్దవాళ్లయిపోయారు గదా. శీనుగాడు చెన్నైలోనే ఉంటాడు. మన సత్తిగాడు మంచివాడు గనక నాలుగ్గింజలు దక్కుతున్నాయి. ఎందుకీ పొలం చెప్పండి? మీ ఇద్దరూ నా దగ్గిరికి వచ్చెయ్యండి. నేను శీనుతో కూడా మాట్లాడే చెప్తున్నాను." ఇద్దరూ మళ్లీ మాట్లాడలేదు. రాత్రి ఆయన పక్కన కూచుంటూ అడిగిందామె.

"ఏవంటారు? పొలం అమ్మడం మంచిదేనంటారా? శీనుగాడు మనతో ఏవీ ఈ ముక్క అనలేదు మరి."

"పొలం అమ్మడం అనే ఆలోచన నేనెప్పుడూ చెయ్యలేదు. పొలం, మనం, ఇదో ఈ ఊరూ... వేరే చోటకి వెళ్లాలని అనిపించలేదు. ఊరంటూ ఒదిలేస్తే పొలం ఎందుకనీ ఉంది. చూద్దాం."

అట్లా మూడు రోజుల్నించీ మనశ్శాంతి లేదు శర్మగారికి. ఒకరోజు ఆగి రాఘవుడే కదిపేడు మళ్లీ.

'ఏం ఆలోచించేరు నాన్నా?" క్షణం ఆగి అతనే అన్నాడు.

"మీరే ఆలోచించండి. ఏవుందిక్కడ? మేం ఇద్దరం మీరున్నారని వస్తున్నాం. శీనుగాడు చెన్నైలో హాయిగా ఉద్యోగం చేస్తున్నాడు. నేను సరే. ఎన్నాళ్లుపడితే అన్నాళ్లు మా ఇద్దరి దగ్గిరా మీరు ఉండొచ్చుగదా?"

"బాగానే ఉందిరా... కానీ ఉన్న ఊరూ, పొలాన్నీ ఒక్కసారి తెంపేసుకుని రావడం... పొలం మళ్లీ కొనగలవా?"

రాఘవుడికి మొదటిసారిగా కోపం వచ్చి తమాయించుకుని అన్నాడు.

"అసలు పొలం ఎందుకు కొండం? ఇంతకంటే రెండు టాక్సీల మీద ఎక్కువ డబ్బులొస్తాయి. పోనీ పొలం ఉంచుకునే దాన్ని సొమ్ము చేసుకోవడం మీకు తెలీదు."

ఆయన ఏవీ అనలేదు. తల ఊపి లేచి వెళ్లిపోయాడు. ("ఏవేనా అన్నారా ఏవిటీ వాణ్ని?") ఆయన్ని వేధించిన ప్రశ్న ఊరికీ తనకీ ఉన్న సంబంధం. నిజానికి సాటిద్రవిడ బ్రాహ్మణ కుటుంబాలు మూడూ ఊరు ఒదిలేశాయి. వెళ్లిపోతూ వడ్లమాని శర్మగారన్నారు.

"ఒరేయి శర్మా. ఒక్కమాట గుర్తుంచుకో. ఈ ఊరికి మన అవసరం లేదు."

ఏవుందిక్కడ? చిన్నప్పట్నించీ తనని ఎరిగున్నవాళ్లున్నారు. తనంటే ప్రత్యేకమైన అగౌరవం ఏవీ లేదు ఊళ్లో. పొలం లేకపోతే కొడుకుల దగ్గిరికి వెళ్లిపోయేవాడాతను? ఏవీ లేదిక్కడ. తన తండ్రి తాతల ఊరు. తను తప్ప అందరూ పొలంలో వ్యవసాయం చేసినవారే. ఊరికి తన అవసరం ఉందని ఎప్పుడూ అనుకోలేదు శర్మ. కానీ ఏదో పేగు సంబంధం. అయినా తెగనంతకాదుగానీ తెంపుకోవాలనే ఆలోచన ఆయనకెప్పుడూ రాలేదు. సతమతమైపోతున్న శర్మగారికి ఊళ్లో తలలు పగలడం పుండు గోకినట్టయింది. చేపల చెరువుల నీళ్లు తన పొలంలోకే వస్తే సత్తెయ్య తప్ప తన వేపు ఎవరు నిలబడతారు? భోజనం చేసి మధ్యాహ్నం కునుకు తీయడం అలవాటాయనకి. మూడ్రోజుల్నించీ మాట్లాడ్డం ఇష్టంలేక కళ్లు మూసుకోడం తప్ప నిద్ర పట్టడం లేదు. రాఘవుడు ఉత్తినే కూచోలేదు.

వాళ్లమ్మతోపాటు భోం చేస్తూ, కాఫీ తాగుతూ మానసికంగా ఆమెని హైదరాబాదు, చెన్నై నగరాలు తిప్పుతున్నాడు. ఇటీవలి కాలంలో శర్మగారికెప్పుడూ ఇటువంటి సమస్య తలెత్తలేదు. సాటివాళ్లెవరూ లేరనే లోటు అనేక సందర్భాల్లో ఆయనకీ అనిపించింది. ఇవాళ తన మనసులో మాట చెప్పుకోడానికీ, సలహా అడగడానికీ ఎవరూ లేరు. తను ఒంటరి వాడయి పోయాడని కూడా అనిపించింది.

ఆ రోజు సాయంకాలం రామకృష్ణ వచ్చేడు. లోపల బట్టలు వేసుకుంటున్నాడు. రాఘవుడు. ఎదురుగా కూచున్న అతనిక్కూడా ఏం మాట్లాడాలో తోచలేదు. శర్మగారు మనసులో మల్లగుల్లాలు పడుతున్నారని తెలుసతనికి. ఇంతలో రాఘవుడు రాగానే ఇద్దరూ బయటికి వెళ్లిపోయారు. కాసేపు అలాగే కూచుండిపోయారు శర్మగారు. చిన్నగేటు తీసుకుని సత్తెయ్య లోపలికి రావడం గమనించలేదు.

"దణ్ణాలు బావూ."

ఇంచుమించు ఉలిక్కిపడ్డారాయన. వరాండాలోంచి బయటికొచ్చి అరుగుమీద కూచున్నారాయన. తువాల్తో మొహం తుడుచుకుంటూ ఆయనెదురుగా గచ్చు నేలమీద కూచున్నాడు సత్తెయ్య. పొలంలో గిల్లాకర్ర ఆడ్డం నేర్పేడాయనకి. తాటికాయల్తో బండి చెయ్యడం నేర్పేడు. ఇద్దరూ కలిసే ఈత పళ్లు కొట్టేవారు. సత్తెయ్యని చూడగానే ఆయనకి ఎందుకో బరువు కొంచెం దిగినట్టయింది.

"ఏవిట్రా సంగతులు? ఏం ఇలా ఒచ్చేవు?"

వెంటనే మాట్లాడలేదు సత్తెయ్య.

"ఇష్టమూర్తిగారు ఇందాకా మీరు పొలం గట్రా అమ్మేసి సొదరిగారికి అయిదరాబాద మకాం మారుస్తున్నారని చెప్పేరండి. ఆయ. ఇంటికి బోయా. గుబులుపుట్టి మీ కాడికి ఒచ్చేనండి. అబ్బాయిగారు సొదరిగారితో మాటాడేరని గూడా తెలిసిందనుకోండి."

"అలాగా."

సత్తెయ్యలో వయసు బాగా తెలుస్తోంది. కళ్ల కింద సంచులేర్పడ్డాయి. నాలుగు రోజుల తెల్లగడ్డం, బట్టతల గుండ్రటి ముఖం, తేమగా ఉన్నట్టుండే కళ్లు; శర్మగారి వేపు చూస్తూ తనలో తనే మాట్లాడుకుంటున్నట్టు మొదలుపెట్టేడు సత్తెయ్య.

"ఇయన్నీ మీకు తెలవ్వని గాదండి. మనిద్దరం ఈడ పెరిగినోళ్లవే గదా. ఆయ. వరిసేలూ కాసిన్ని కొబ్బరి తోటలుండేవి. మీ వడ్డమానారు, పాలగుమ్మారూ ఊరొదిలి ఎళ్లేపోయారు. మీకు పుటక్కీ సావుకీ మంత్రం చెప్పే బేమర్లే లేరు. ఎవురిదో వాళ్లు జూసుకున్నారనుకోండి... ఆయ. ఇప్పుడింకేవుంది బావూ? పొలాలు కొబ్బరి తొట్లు సేపల

సెరువులయిపోయాయి. బంగారం లాంటి ఊడుపుసేలు అమ్మేసుకున్నారు, లీజులికిచ్చార. ఇద్దరూ బాగనే ఉన్నారనుకోండి. ఈ కొన్నవాడెవరు బావూ? సౌదరి గారిది మన జిల్లా ఏటండి? మరి ఈడకొచ్చి సెరువులు పెట్టి మందీమారబలం అవుర్చుకున్నారండి. ఊళ్లో రైతులకి మీ పదేనెకరాల మీ దుందండి. ఏవవుద్దా అని సూత్తన్నారండి ఆయ.... ఏవైందో ఎరుగుదురా? సేపల సెరువులు పెట్టి ఏం జేసేరండి? కాపలా కాత్తానికి ఓడండి. పోనీ ఇద్ద రనుకోండి. మందూగట్టా ఏసేవాడో ఆయనే పై నించి రప్పింతన్నాడు. ఆయ. మరదే ఊడుపు పొలం అనుకోండి, ఎంతమందికి బువ్వ దొరుకుద్దండి? తొలకరి కాణ్నించి కోతల దాకా ఎంతమందికి కూలి దొరికేదండి మరి? పైగా ఏటండి ఎవసాయం పనులు ఏదో ఒకటి ఏటికేడాదీ ఉంటనే ఉంటదండి. మరీ లేని రోజులు లేవని గాదండి. మావోళ్లకి పనిబోయి కూలికి పై ఊళ్లు పోతన్నారండి. ఆడ మాత్రం ఎప్పుడూ దొరుకుద్దేటండి? కొబ్బరి తోటలకి ఎంత పనుండేదండాయ? అంతెందుకు బావూ సేపల సెరువులు ఒచ్చిన కాణ్నించి శానాబత్తులోరికి పని బోయింది. కొన్నాళ్లకి ఊళ్లో కల్లాపేసుకోడానికి పేడదొరుకుద్దేమో చూడండి. చారెడు బూవి ఎంతమందికి కూడు బెడుద్దో ఎరుగుదురా? సెరువులు పెట్టి బూవుల్ని సంపుతున్నారు బావూ.... మాలొంటాళ్లు కడుపులు పట్టుకుని ఊరొదిలి పోతావండి. ఆయ. మీరు మాత్రం ఏం జెయ్యగల్దురు లెండి. మీ పొలంలో సౌదరిగారు సెరువులు పెడతారండి. మాలాంటోళ్ల బతుకేవైతే ఎవురికండి?... ఊరంటే ఊళ్లో సిన్నా పెద్దా అందరూ బావుంటేనే ఊరండి... సెలవిప్పించండి బావూ."

ఇద్దరిచుట్టూ చీకట్లు పరుచుకున్నాయి. చీకట్లోకి వెళ్లిపోయేడు సత్తెయ్య. దిమ్మరబోయి కూచున్నారు శర్మగారు. సత్తెయ్య వెళ్లడం ఆయన గమనించలేదు. కూతుర్ని కాపరానికి పంపేముందు ఏడిచేరాయన. ఎన్నో ఏళ్లక్రితం రాజోల్లో నాజరు బుర్ర కథ విని చలించిపోయారు. తల్చుకున్నప్పుడల్లా ఒళ్లు గగుర్పొడిచేది. కర్మయోగం గురించి ఒకసారి యేర్పేడు స్వామీజీ ప్రవచనం విని తరచుగా గీత చదవడం నేర్చుకున్నారాయన. కొన్ని ఏళ్ల తరవాత ఈ మునిమాపు వేళ సత్తెయ్య మాట్లాడిన మామూలు వాక్యాలు శర్మగార్ని సమూలంగా కుదిపేశాయి. తాను చదివే కర్మయోగంలా పనిచేశాయాయన మీద. "చీకట్లో కూచున్నారేవిటీ" అంటూ ఆమె లైటు వేసి వెళ్లిపోయింది. అది కూడా గమనించలేదు శర్మగారు. విచిత్రంగా ఆయనకీ గ్రామానికీ ఏదో సంబంధం ఏర్పడినట్టనిపించింది.

రాత్రి ఎప్పుడోగాని నిద్ర పట్టలేదు. ఉదయం లేస్తూనే భార్యతో అన్నారాయన.

"చూడూ, నే చెప్తే బాధపడతాడు, వాడు... ప్రస్తుతానికి పొలం అమ్మే ఉద్దేశం లేదని చెప్పు."

❖ ❖ ❖